అధికారం అండగా చెలరేగిపోయారు. తమ ఎమ్మెల్యేలు, నేతలను చూసి శ్రేణులూ రెచ్చిపోయాయి. మళ్లీ మనమే అధికారంలోకి వస్తున్నామంటూ కార్యకర్తలకు భ్రమలు కల్పించారు. నాయకులూ అదే భావనలో ఉన్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో అరాచకం, విధ్వంసం సృష్టించారు. వీరి దౌర్జన్యాలు, కక్ష సాధింపు చర్యలతో విసిగిపోయిన జనం.. జిల్లాలో పుంగనూరు మినహా అన్నిచోట్లా ఘోరంగా ఓడించారు. అప్పటి వరకూ మేమున్నామంటూ శ్రేణులకు చెబుతూ వచ్చిన వైసీపీ అభ్యర్థులు.. ఘోర పరాజయం తర్వాత వెనుతిరిగారు. ఐదేళ్ల అధికారాన్ని అనుభవించి ఒక్క ఓటమితో కార్యకర్తల్ని గాలికొదిలేశారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర అయోమయం, గందరగోళానికి గురవుతున్నారు. తమ మాటలు నమ్మి రాజీనామాలు చేసిన వలంటీర్లను వీరు పట్టించుకోవడంలేదు. దీంతో ఆయా అభ్యర్థుల వ్యవహారశైలిపై వాళ్లూ అసంతృప్తి, అసహనంతో ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



వీరి వీరి గుమ్మడి..
వీరి ఆచూకీ ఏదీ..?

- ఓడిపోగానే నియోజకవర్గాలను వీడిన నేతలు
- శ్రేణులను పట్టించుకోని వైసీపీ అభ్యర్థులు
- అయోమయంలో ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు

1 చెన్నైకి మకాం మార్చిన రోజా

మాజీ మంత్రి రోజా ఘోర పరాజయం తర్వాత చెన్నైకి మకాం మార్చారు. వైఎస్ఆర్ జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. నగరి నియోజకవర్గంలోని నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో వారంతా ఆందోళనలో ఉన్నారు. టీడీపీలోకి వెళ్దామంటే అక్కడ గేట్లు మూసేశారు. రాజకీయ భవిష్యత్తు కోసం కొంతమంది కాపు సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జనసేనలో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

2 అడ్రస్ లేని నారాయణస్వామి

డిప్యూటీ సీఎంగా పనిచేసిన నారాయణస్వామి వైసీపీ ఓడినప్పటి నుంచి అడ్రస్ లేకుండా పోయారు. అధికారంలో ఉన్నప్పుడు నిత్యం ప్రతిపక్షాలను, మీడియా ధిపతులను దూషిస్తూ కాలం గడిపిన ఆయన, ఇప్పుడు ఎక్కడా నోరు తెరవడం లేదు. అప్పట్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ వైఎస్సార్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొనే ఆయన.. ఈ మధ్య ఎస్ఆర్ పురం మండలంలో మాత్రమే పాల్గొన్నారు. పుత్తూరులో కొన్ని రోజులు, చెన్నైలో మరి కొన్ని రోజులు ఉంటున్నారు.

3 చిత్తూరులో సగానికిపైగా వైసీపీ ఖాళీ

జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఇప్పటికే సగానికిపైగా వైసీపీ ఖాళీ అయిపోయింది. మిగిలిన కొందరు కూడా పార్టీలో చురుగ్గా లేరు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తలుపులు తెరిస్తే నియోజకవర్గంలో మిగిలిన వైసీపీ కూడా ఖాళీ అయిపోయే అవకాశం ఉంది. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన విజయానందరెడ్డి గతంలో వైఎస్సార్ జయంతిని వేడుకలా నిర్వహించేవారు. ఈసారి గుడిపాలలో మాత్రం పాల్గొన్నారు. అక్కడి కార్యక్రమమూ నామమాత్రంగానే జరిగింది. ఆయన చిత్తూరులోనే ఉన్నారని చెప్తున్నప్పటికీ.. ఎక్కడా కనిపించడం లేదు. జిల్లాలో మిగిలినవారి కంటే ఓటమి పట్ల ఎక్కువ డిప్రెషన్‌లోకి వెళ్లిన వ్యక్తి విజయానందరెడ్డి మాత్రమేనని వైసీపీలో ప్రచారం జరుగుతోంది.

పుంగనూరులో భిన్న పరిస్థితులు



పుంగనూరులో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబం చేసిన అరాచకాలతో నలిగిపోయిన నియోజకవర్గ ప్రజలు, రైతులు, టీడీపీ శ్రేణులు వారిని నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. ఓ సారి పెద్దిరెడ్డి, రెండుసార్లు మిథున్ రెడ్డి వెనక్కి వెళ్లిపోయారు. ఈమధ్య మిథున్‌రెడ్డి మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి వస్తే ఉద్రిక్త పరిస్థితులు, వివాదాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే వైసీపీ కీలక నాయకులు, పెద్దిరెడ్డి ప్రధాన అనుచరులు వైసీపీని వీడుతున్నారు. చల్లా బాబు అనుమతిస్తే నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అయిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. పులిచెర్ల జడ్పీటీసీ, రాష్ట్ర పాలేకరి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మురళీధర్‌తో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీకి రాజీనామా చేశారు. పుంగనూరులో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో పాటు పది మంది కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేసి.. చల్లా బాబు సమక్షంలో త్వరలో టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. రొంపిచెర్ల మండలంలోనూ కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు రాజీనామా చేశారు. చాలామంది టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

4 చెన్నైకే పరిమితం

ఇక ఎన్నికల్లో జీడీనెల్లూరు అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన ఆయన కుమార్తె కృపాలక్ష్మి చెన్నైకే పరిమితమయ్యారు. చివరికి వైఎస్సార్ జయంతి కార్యక్రమాల్లోనూ ఆమె పాల్గొనలేదు. తండ్రీ కూతుళ్ల నియోజకవర్గంలో జరిగే ముఖ్యమైన శుభకార్యాలకు మాత్రమే ఒకట్రెండు సార్లు హాజరయ్యారు. ఇక్కడా ఎమ్మెల్యే థామస్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే వైసీపీ ఖాళీ అయిపోయే అవకాశముంది.

5 'రియల్' వ్యాపారంలో నిమగ్నమై..

పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ బెంగళూరులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో మాత్రమే పాల్గొన్నారు. పలమనేరులోని గుడియాత్తం రోడ్డులో ఉండే రెండు వైసీపీ కార్యాలయాల్లో.. ఒకటి మూసేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న హేమంత్‌కుమార్‌రెడ్డి ఇటీవల తన పదవికి రాజీనామా చేసి, ఇక రాజకీయాలు వద్దని అనుచరులతో చెప్పినట్లు తెలుస్తోంది. ఇలా బడా నాయకులే స్వస్తి పలుకుతుంటే కిందిస్థాయి వారంతా మరింత అభద్రతకు లోనవుతున్నారు.కొంతమంది టీడీపీలోకి రాలేక, వైసీపీలో కొనసాగలేక జనసేన వైపు మొగ్గు చూపుతున్నారు. పలమనేరు కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నా ఎమ్మెల్యే అమర్ ఆహ్వానించడం లేదు.

6 ప్రాక్టీస్‌కే పరిమితమైన డాక్టర్ సునీల్

పూతలపట్టులో వైసీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన డాక్టర్ సునీల్ కుమార్ పలమనేరులోని తన ఆస్పత్రిలో ప్రాక్టీస్‌కే పరిమితమయ్యారు. వైద్య సేవలు చేసుకుంటున్నారు. తమకు దిక్కెవరంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నా.. టీడీపీ కోసం శ్రమించిన వారికే మొదటి ప్రాధాన్యమిచ్చే క్రమంలో ఎమ్మెల్యే మురళీ నుంచి ఇంకా అంగీకారం రానట్టు తెలుస్తోంది.

7 హైదరాబాద్‌లోనే ఎమ్మెల్సీ భరత్

కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ప్రభుత్వం మారిన తర్వాత వారం రోజులు మాత్రమే స్థానికంగా ఉన్నారు. సాధారణంగా ఆయన కుటుంబం హైదరాబాద్‌లో ఉండడంతో.. ఆయనా అక్కడే ఉంటున్నారు. చివరికి ఆయన వైఎస్సార్ జయంతి కార్యక్రమాల్లోనూ పాల్గొనలేదు. దీంతో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. వారంతా టీడీపీలోకి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల మున్సిపల్ చైర్మన్ సుధీర్ అమరావతికి కూడా వెళ్లివచ్చారు. సీఎం చంద్రబాబు కూడా వైసీపీలో తటస్థంగా ఉన్న నేతలను చేర్చుకోవచ్చని చెప్పడంతో.. త్వరలో ఇక్కడ వైసీపీ ఖాళీ అవ్వనుంది.

ఇంటర్ విద్యార్థులకు
పుస్తకాలు వచ్చేశాయోచ్!

- వచ్చే వారంలో పంపిణీ లాంఛనంగా ప్రారంభం
- వైసీపీ హయాంలో ఇచ్చింది ఒక్కసారే


జిల్లాకు చేరిన పుస్తకాలు

చిత్తూరు (సెంట్రల్), జూలై 26: ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చాయి. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులతో కూడిన కిట్లు అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దీనిపై దృష్టి పెట్టారు. అన్నట్టుగానే ఇంటర్మీడియట్ విద్యా మండలి నిధులతో పాఠ్యపుస్తకాలు ముద్రించడంలో పాటు అవసరమైన నోట్ పుస్తకాలు, బ్యాగులు అందించే యత్నం చేశారు. ఈ పుస్తకాలు, బ్యాగులు జిల్లా కేంద్రానికి.. అటు నుంచి మండలాలకు చేరాయి. వచ్చే వారంలో ఇంటర్ విద్యార్థులకు కిట్ల పంపిణీని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది.

వైసీపీ పాలనలో ఇలా..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం 2020-21 విద్యా సంవత్సరంలో మాత్రమే ఉచిత పాఠ్యపుస్తకాలు అందించారు. ఆ తర్వాత ఉచితానికి మంగళం పాడారు. ఇది విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించింది. గత నాలుగేళ్లలో ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 55 శాతం మించలేదు. 2008 నుంచి 2013 వరకు పుస్తక ప్రసాదం కింద టీటీడీ పుస్తకాల ముద్రణకు నిధులు ఇచ్చింది. తర్వాత ప్రభుత్వం ఇంటర్ విద్యా మండలి నిధులతో పాఠ్యపుస్తకాలు ముద్రించి పంపిణీ చేశారు. 2021-22 సంవత్సరంలో పుస్తకాల ముద్రణపై స్పష్టత కొరవడటంతో పుస్తకాలు అందే పరిస్థితి కనిపించలేదు. జిల్లాల విభజన తర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో స్టాక్ ఉన్న కొన్ని పుస్తకాలను ఆ ఏడాది మాత్రం అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేతులు దులుపుకున్నారు. దీంతో మూడేళ్లుగా ఉచిత పాఠ్యపుస్తకాల కోసం విద్యార్థులకు ఎదురు చూపులు తప్పలేదు. దీంతో తాము బోధించిన పాఠ్యంశాల్లో విద్యార్థులకు తలెత్తే సందేహాలను ఏ మేరకు నివృత్తి చేసుకోగలరన్న ఆందోళన అధ్యాపకులను వెంటాడింది. 2020-21 ఫలితాలు ప్రథమ ఇంటర్‌లో 51 శాతం కాగా, 2023-24 వరకు ఇదే దోరణి కొనసాగింది. మరో పక్క పుస్తకాలు లేకుండా తమ పిల్లలు ఎలా చదువుకోవాలన్న ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచీ వ్యక్తమైంది. గతేడాది పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం ముద్రించినా, అవి బహిరంగ మార్కెట్‌కు అందించి సొమ్ము చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సైతం బహిరంగ మార్కెట్‌లో కొనాల్సి వచ్చింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఒకటిన్నర నెలలోనే ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేపట్టింది.

41,450 మంది విద్యార్థులు.

జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో మొదటి, ద్వితీయ సంవత్సరంలో 41,450 మంది విద్యార్థులు చదువుతున్నారు. యాజమాన్యాల వారీగా.. 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 23 వేల మంది, ఏపీ రెసిడెన్షియల్‌లో 2418 మంది, 8 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో 1484 మంది, 7 ఏపీ మోడల్ స్కూల్‌ల్లో 4061 మంది, 19 హైస్కూల్ ప్లస్‌లో 3487 మంది, ఒకేషనల్ గ్రూపులో 7 వేల మంది చదువుతున్నారు. వీరికి అవసరమైన కిట్లు అందించనున్నారు.

'కార్గిల్' అమరవీరులను
స్మరించుకుందాం


కార్గిల్ యుద్ధవీరులను సత్కరించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26: కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పోరాడిన 8 మంది మాజీ సైనికులను తన చాంబర్‌లో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్గిల్ యుద్ధం 1999 మే 3న నుంచి జూలై 26వ తేదీ వరకు కొనసాగిందన్నారు. పాకిస్థాన్‌పై భారతదేశం తిరుగులేని విజయం సాధించిందని చెప్పారు. ఈ యుద్ధంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేసిన వినాయకరెడ్డి సేవలను ఈ సందర్భంగా కలెక్టర్ కొనియాడారు. జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఆర్.విజయశంకర్ రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, జూలై 26: దివ్యాంగ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ తెలిపారు. 9, 10 తరగతులు చదువుతున్న వారు అర్హులని, వచ్చే నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్, ఆపై విద్యార్థులు అక్టోబరు 31వ తేదీలోపు scholarships.gov.in. వెబ్‌సైట్‌లోని డిపార్టుమెంటు ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిజేబిలిటీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

జాతీయ అవార్డులకు కూడా..

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులు, దివ్యాంగుల సాధికారిత కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలు జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. సూచించారు. అర్హులైన వారు awards.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు depwd.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

నైపుణ్యాన్ని వెలికితీస్తేనే మహిళా సాధికారత

- ఆ దిశగా ఎన్టీఆర్ ట్రస్టు సేవలు
- కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో నారా భువనేశ్వరి


పీఈఎస్ ఆడిటోరియంలో మహిళలకు కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న భువనేశ్వరి

కుప్పం, జూలై 26: తమలో దాగిన నైపుణ్యాలను వెలికి తీసి, ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేస్తేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అభిప్రాయపడ్డారు. కుప్పంలో శుక్రవారం ఆమె ఎన్టీఆర్ ట్రస్టు తరఫున స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం పీఈఎస్ ఆడిటోరియంలో 31 కుట్టు మిషన్లు, 25 తోపుడు బండ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంక్షేమం, ఆర్థిక స్వాలంబన, సాధికారతే ధ్యేయంగా కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పెట్టామన్నారు. ఎన్టీఆర్ ట్రస్టును సేవా భావంతో చంద్రబాబు స్థాపించారని, అదే స్ఫూర్తితో తాము ముందుకు వెళ్తున్నామన్నారు. మహిళలకు కుట్టుపని నేర్పిస్తే వారికాళ్లపై వాళ్లు నిలబడతారన్నారు. అయితే కుట్టు పనితోనే ఆగకుండా.. దుస్తుల పరిశ్రమల వారికి ఏ మోడల్ బట్టలు కావాలో తెలుసుకుని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పొందినవారితో కుట్టించి మార్కెటింగ్ సదుపాయాన్నీ కల్పించేలా మాట్లాడుతున్నామని చెప్పారు. వైరు బుట్టలు, ఇతర చేతిపనులు వంటివి మహిళల అసక్తిని అనుసరించి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ తీసుకున్న మహిళలకు ప్రత్యేకంగా కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి, వారి ఉత్పత్తులు వారే విక్రయించుకునేలా నిర్వహణ సామర్థ్యాలనూ పెంచుతామన్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి మహిళా సాధికారతకు కృషి చేస్తామన్నారు. ట్రస్టు ద్వారా కుప్పంలో స్కూల్ ఏర్పాటు చేసి, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. డీఎస్సీ, ఐఏఎస్ కోచింగ్‌నూ ఉచితంగా అందించేలా సెంటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు అన్ని రంగాలతోపాటు రాజకీయాలను శాశించే స్థాయికి ఎదగడానికి ఎన్టీ రామారావే కారణమని గుర్తుచేసుకున్నారు. దీనిని చంద్రబాబు కూడా కొనసాగించారని చెప్పారు. ఎన్టీఆర్ మహిళలకు ఇచ్చిన 9 శాతం రిజర్వేషన్లను 33 శాతానికి చంద్రబాబు పెంచారని, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారని వివరించారు. 'హెరిటేజ్' బాధ్యతలను చంద్రబాబు అప్పగించే నాటికి తనకేమీ తెలియదన్నారు. అధైర్యపడకుండా పని నేర్చుకుని ఇప్పుడు సాధికారంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కుప్పం మహిళలను సాధికారత దిశగా నడిపించి, అభివృద్ధి చేయడమే భువనేశ్వరి లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ట్రస్టు ద్వారా అనేక కార్యక్రమాలను ఆమె చేపడతారన్నారు. 1997లో చంద్రబాబు స్థాపించిన ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అనేక రూపాలలో, అనేకరకాలుగా సేవలు అందిస్తున్నామని, వీటిని విస్తరించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు సీఈవో రాజేంద్ర కుమార్ తెలిపారు. ట్రస్టు ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. టీడీపీ నాయకులు, మహిళలు, ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బషీర్ మరో సైకిల్‌యాత్ర



పలమనేరు, జూలై 26: పర్యావరణం, చెట్ల ప్రాధాన్యతను చాటుతూ పలమనేరు నుంచి లడఖ్‌కు 32 రోజులపాటు సైకిల్ యాత్ర చేసిన బషీర్.. ఈనెల 17న ఇక్కడికి చేరుకున్నారు. మళ్లీ శుక్రవారం మరో చైతన్య సైకిల్ యాత్రను ఆయన ప్రారంభించారు.ఈసారి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పలమనేరు నుంచి నేపాల్, భూటాన్‌కు సైకిల్‌పై బయలు దేరారు. పలమనేరులోని చైతన్యకళాశాల నుంచి బషీర్ సైకిల్‌పై తన యాత్రను ప్రారంభించాడు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఆయన్ను అభినందించారు.

రెస్కోలో డేటా నష్టం జరగలేదు: ఎండీ

కుప్పం, జూలై 26: కుప్పం రెస్కోలో సాంకేతిక సమస్య తలెత్తింది తప్ప, ఎటువంటి డేటా చౌర్యం జరగలేదని ఎండీ సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'కుప్పం రెస్కోలో సర్వర్ డౌన్' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు శుక్రవారం వివరణ ఇచ్చారు. 2011వ సంవత్సరంలో స్థాపించిన డేటా బేస్ సర్వర్‌లోని 5 హార్డ్ డిస్కులలో ఒక దానిలో సాంకేతిక సమస్య ఏర్పడిందన్నారు. ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన రెండు రోజులలో సవరించి, రీస్టోర్ చేశామన్నారు. హార్డ్ డిస్క్ పనిచేయకపోవడమన్నది సాంకేతిక సమస్య మాత్రమేనని, ఇందులో ఎటువంటి అనుమానిత చర్యలు లేవని ఎండీ పేర్కొన్నారు.

కుప్పం ఆర్డీవోగా శ్రీనివాసులురాజు

● భీమవరం నుంచి బదిలీ చేస్తూ ఉత్తర్వులు



కుప్పం, జూలై 26: కుప్పం ఆర్డీవోగా కొనుదూరు శ్రీనివాసులురాజును నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆర్డీవోగా పనిచేస్తున్న ఈయన్ను కుప్పానికి బదిలీ చేశారు. కాగా, గతేడాది అక్టోబరులో కడప నుంచి భీమవరం వెళ్లిన శ్రీనివాసులురాజు ప్రస్తుతం బదిలీపై కుప్పం వచ్చారు. కుప్పం ఆర్డీవోగా పనిచేస్తున్న గోపల్లి శ్రీనివాసులును ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు సఫాయి కర్మచారి చట్టంపై సమావేశం

చిత్తూరు, జూలై 26: కలెక్టరేట్ సమావేశపు హాలులో శనివారం సఫాయి కర్మచారి చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరుగుతుందని షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పుంగనూరులో 4.0, నగరి 3.2, పెనుమూరు 3.0, విజయపురం 2.4, పూతలపట్టులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

29న నిధి ఆప్-కే-నికట్‌పై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ నెల 29వ తేదీన స్థానిక గంగనపల్లిలోని క్యాంఫోర్డ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. చందాదారులు, పెన్షన్‌దారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



గంజాయి దొంగలను అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి

పలమనేరు, జూలై26 : పలమనేరు- గుడియాత్తం రహదారిలో మండీపేట కోటూరు క్రాస్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఒక ద్విచక్ర వాహనం, రూ.20 వేలు విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి కథనం మేరకు.. బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లి పంచాయితీ మోట్లపల్లి గ్రామానికి చెందిన పునీత్‌రెడ్డి(22), బురిశెట్టిపల్లి గ్రామానికి చెందిన బంగి అనిల్‌కుమార్(21) గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిని పలమనేరు కోర్టుకు తరలించారు. కాగా ఇదే కేసుతో సంబంధం ఉన్న గంగవరం మండలం మేలుమాయి కొత్తూరుకు చెందిన పులగూర కార్తీక్(22), పలమనేరు మండలం చెత్తపెంట గ్రామానికి చెందిన తలారి మణికంఠ(27), ఎల్లప్పగారి గణపతి (24) కోసం గాలిస్తున్నారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు కె.క్రిష్ణమాచారి, ఈవీ దేవ రాజులు, కానిస్టేబుళ్లు మురళి, అల్తామాస్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

టీటీడీ సీఈ నియామకాన్ని తప్పుబట్టిన హైకోర్టు

సీనియార్టీ పాటించాలని సూచన

తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజినీర్(సీఈ) నియామకాన్ని ఏపీ హైకోర్టు తప్పుబట్టింది. సీనియార్టీకి అనుగుణంగా సీఈ నియామకం జరగాలని టీటీడీని ఆదేశించింది. సీనియార్టీ ఉన్నా తనకు చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించలేదని, తనకన్న జూనియర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు పదోన్నతి కల్పించారంటూ ఎస్ఈ సత్యనారాయణ గతంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో కోర్టు కూడా స్పందిస్తూ సర్వీస్ రూల్స్ అనుగుణంగా పదోన్నతి కల్పించాలని పలుమార్లు టీటీడీని ఆదేశించింది. అయితే నాగేశ్వరరావు ఫిట్ పర్సన్ అని, రికార్డ్స్ పరిశీలించి అతన్ని ఏకగ్రీవంగా సీఈగా ఎంపిక చేసినట్టు టీటీడీ కోర్టుకు వివరించింది. అయితే పిటిషన్‌దారు సమర్పించిన రికార్డులను పరిశీలించిన హైకోర్టు సత్యనారాయణ సీఈ పోస్టుకు అర్హుడని స్పష్టం చేసింది. డీపీసీ(డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నియమనిబంధనలు పాటిస్తూ సత్యనారాయణను 2020 నుంచే సీఈగా పరిగణించాలని రెండురోజుల క్రితం తీర్పునివ్వడం టీటీడీకి చెంపపెట్టులా మారింది. ఇక సీఈ నియామకంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. చీఫ్ ఇంజినీర్‌గా తమకు అనుకూలమైన వ్యక్తి ఉంటేనే ఇష్టానుసారం వ్యవహరించవచ్చనే ఉద్దేశంతోనే గత ప్రభుత్వంలోని అధికారులు ఈ అక్రమ నియామకం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కీలకమైన విభాగాల్లో తమకు అర్హత లేని వ్యక్తులను నియమించి వ్యవస్థను తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నియామకంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించి బాధ్యులైన వారిపై నూతన ఈవో శ్యామలరావు చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

జగన్‌ని డ్రామాల రెడ్డిగా పిలుస్తాం : బీజేపీ



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, జూలై 26: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇకపై డ్రామాలరెడ్డిగా పిలుస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో జగన్ చేసింది ధర్నాలా లేదని, అచ్చం డ్రామాలాడుతున్నట్లు ఉందని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన దెబ్బకు మతిపోయిందన్నారు. రాష్ట్రపతి పాలన ఎప్పుడు విధిస్తారో తెలియని వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా పాలించారో అర్థం కావడం లేదన్నారు. 'మీరు.. మీరు కొట్టుకు చంపుకుని.. ఆ నేరాన్ని కూటమిపై వేస్తారా?' అంటూ వైసీపీ శ్రేణులపై ఆగ్రహించారు. ప్రభుత్వం ఏర్పడి 44రోజులే అయ్యిందని అప్పుడే విమర్శలు చేయడం తగదన్నారు. వికసిత్ ఆంధ్రాకు అడుగులు పడుతున్నాయని, సీమాంధ్రను స్వర్ణాంధ్రగా మారుస్తామన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాల్చితే దోషులు తప్పించుకోలేరని, 956ఎకరాలు కాజేసిన పాపాల పెద్దిరెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణాన్ని త్వరలో ఆధారాలతో సహా బయటపెడతామని స్పష్టం చేశారు. అజయ్‌కుమార్, వరప్రసాద్, జీవన్‌రాయల్, సుబ్బుయాదవ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.55 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 61,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 25,082 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

'డాయ్ యాప్'లో ఆర్పీలే కీలకం

● వీళ్లే డిపాజిట్లు కట్టించారంటున్న బాధితులు ● సెలవులో మెప్మా ఉద్యోగి రాజేష్
● మోసంపై సీఐకి పలువురి ఫిర్యాదు



సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేస్తున్న డాయ్ యాప్ బాధితులు

పలమనేరు, జూలై 26: పలమనేరు ప్రాంతంలో దాదాపు రూ.100 కోట్ల వరకు ప్రజలకు కుచ్చుటోపి పెట్టిన 'డాయ్ యాప్' ఘటనలో మున్సిపాలిటీ పరిధిలో పలువురు ఆర్పీలే కీలక పాత్ర పోషించారని బాధితులు అంటున్నారు. మెప్మా కార్యాలయంలో రాజేష్ అవుట్‌సోర్సింగ్‌గా పనిచేస్తూ పలువురు ఆర్పీలతో సన్నిహితంగా ఉంటూ ఈ తతంగం నడిపించినట్లు తెలుస్తోంది. రాజేష్ సూచనల మేరకు వీరంతా మహిళల వద్ద డాయ్ యాప్‌లో డిపాజిట్లు కట్టించినట్లు సమాచారం. తమ గ్రూపులకు సంబంధించి రుణాల కోసం కొందరు ఆర్పీలను కలిస్తే.. డిపాజిట్ చేస్తే గాని రుణాల మంజూరుకు బ్యాంకులకు దరఖాస్తులు పంపబోమని ఒత్తిడి తెచ్చినట్లు విమర్శలున్నాయి. మున్సిపాలిటీలో దాదాపు 800కు పైగా స్వయం సహాయక సంఘాలు ఉండగా వీటి నిర్వహణ కోసం 42 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. కాగా, ఈ ఘటనలో మూల సూత్రధారి అయిన మెప్మా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాజేష్ కనిపించకుండా పపోయాడు. దీనిపై అధికారులను విచారించగా గురు, శుక్రవారాలు సెలవుపెట్టారని చెప్పారు. కాగా, డాయ్ యాప్‌ను పరిచయం చేసిన రాజేష్‌కు మరికొందరు సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతడికి సన్నిహితంగా ఎవరెవరు ఉన్నారనే వివరాలను సేకరిస్తున్నారు. రాజేష్‌కు అత్యంత సన్నిహితంగా రాజేష్ అనే పేరున్న మరో వ్యక్తి ఉన్నాడని, అతడికి పట్టణంలో మరో అసాంఘిక వ్యాపారంలో ఉన్నాడని చెబుతున్నారు. ఆ రాజేష్‌ను మాత్రం పోలీసులు అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేస్తారా అనేది చూడాలి. ఇక, గురువారం డాయ్ యాప్ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఇందులో కీలక పాత్ర పోషించిన కొందరు ఆర్పీలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బాధితులు ఇళ్ల వద్దకు వచ్చి గొడవ చేస్తారన్న అనుమానంతో వీరు ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి వెళ్లిపోయినట్లు బాధిత మహిళలు చెబుతున్నారు. ఇక, బాధితుల్లో కొందరు వార్డు స్థాయి నాయకుల వద్దకు చేరి తమకు ఎలైగైనా తాము పోగొట్టుకొన్న సొమ్ములు వచ్చేలా సాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు. దీంతో వారు మున్సిపల్ అధికారులను కలిసి చర్చిస్తున్నారు. మరోవైపు కొందరు బాధితులు శుక్రవారం పలమనేరు సీఐ చంద్రశేఖర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. తాము మోసపోయిన ఉదంతంపై డీఎస్పీ విష్ణురఘువీర్‌కు బాధితులు మౌఖికంగా ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు వీరు ఫిర్యాదులు చేశారు.

సైబర్ క్రైం పరిధిలోకి కేసు

డాయ్ యాప్ ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈకేసును తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని డీఎస్పీ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ డాయ్ యాప్‌లో భౌతికంగా కాకుండా.. ఆన్‌లైన్ పద్ధతిలో డిపాజిట్లు జరిగినట్లు తెలిసింది. అందుకని సైబర్‌క్రైం పోలీసుల సహకారంతో ఈ కేసు దర్యాప్తు చేయించనున్నట్లు తెలుస్తోంది.

పాడి రైతులకు సేవలందించాలి



మ్యాంగో భవన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు (సెంట్రల్), జూలై 26 : జిల్లాలోని పాడి రైతులకు అవసరమైన సేవలు అందించేలా సచివాలయ స్థాయిలో పశుసంవర్థక సహాయకులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మ్యాంగో భవన్‌లో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 282 మంది పశుసంవర్థక సహాయకులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో 5.50 లక్షల మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో ఉంటూ పాడి పశువులు, జీవాల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల పెంపకం, షెడ్స్ స్కీంలకు అర్హులను గుర్తించాలన్నారు. జేడీ ప్రభాకర్, సహాయ సంచాలకులు, సహాయ సంచాలకులు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

మ్యాంగోభవన్ పరిశీలన

మ్యాంగోభవన్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. వసతులు, ప్రయోగశాల, విదేశీ ఎగుమతుల కోసం చేస్తున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య సభ్యుడు, సంస్థ కార్యదర్శి కట్టమంచి బాబీ ఆధ్వర్యంలో మామిడి గుజ్జు పరిశ్రమల్లో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

కొబ్బరికాయల వ్యాపారి కిడ్నాప్ సుఖాంతం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

భాకరాపేట/తిరుపతి(నేరవిభాగం),జూలై 26: తిరుపతికి చెందిన వ్యాపారి కిడ్నాప్ కథ చివరకు సుఖాంతమైంది. చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందరపల్లెకు చెందిన భాస్కర కొన్ని సంవత్సరాలుగా తిరుపతిలోని మంగళం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్న ఈయన ఆటో కూడా నడుపుతుంటాడు.సొంత పనుల నిమిత్తం బుధవారం స్వగ్రామానికి వచ్చి తిరిగి తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలోని చిన్నగొట్టిగల్లు వద్ద కిడ్నాప్ అయ్యాడు.తన కుమారుడు రెడ్డికిరణ్‌కు వాట్సప్ కాల్ చేసి తాను కిడ్నాపర్ల చెరలో వున్నట్లు తెలియ జేశాడు.రెడ్డికిరణ్ వెంటనే భాకరాపేట పోలీసులకు కిడ్నాప్ విషయం తెలిపాడు.రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ నెంబరు ఆధారంగా కిడ్నాపర్లు వెళుతున్న వాహనం లోకేషన్‌ను గుర్తించి పీలేరు సమీపంలో వెంబడించారు. పోలీసుల రాకను గుర్తించిన నలుగురు కిడ్నాపర్లు వారి వాహనాన్ని ఢీకొట్టి తిరుపతి వైపు పారిపోతుండగా చంద్రగిరి మండలం కాలూరు క్రాస్ వద్ద మరో పోలీసు బృందం కిడ్నాపర్లను అటకాయించింది.ఇదే సమయంలో కిడ్నాపర్ల వాహనం టైరు పంక్చర్ కావడంతో పోలీసులకు దొరికిపోయారు.కిడ్నాపర్ల ముఠాలో చిన్నగొట్టిగల్లుకు చెందిన జీషామ్‌తో పాటు బెంగళూరుకు చెందినవారున్నారని సమాచారం. ఎర్రచందనం స్మగ్లింగుతో కిడ్నాపర్లకు సంబంధమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్‌కు కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.కిడ్నాప్ ఘటనకు సంబంధించి తిరుచానూరు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదై భాకరాపేట పోలీసులకు బదిలీ చేయబడింది.ఎస్పీ సుబ్బరాయుడి పర్యవేక్షణలో భాకరాపేట సీఐ మస్తాన్‌వలి, ఇన్‌చార్జ్ ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఈవో తనిఖీలు

భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా



తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఈవో శ్యామలరావు శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు పంపిణీ తదితర విషయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులను దర్శనానికి అనుమతించేటప్పుడు గేట్లు తెరవడం, కంపార్టుమెంట్లలో పారిశుధ్య చర్యలు, పెద్ద స్క్రీన్‌లలో ప్రసారం అవుతున్న ఎస్వీబీసీ కార్యక్రమాలు, వివిధ భాషలలో భక్తులకు అందిస్తున్న సమాచారం తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతకుముందు గోకులంలో శ్రీవాణిట్రస్టు ద్వారా భక్తులకు కేటాయిస్తున్న టికెట్ల జారీని ఈవో పరిశీలించారు. శ్రీవాణి ట్రస్టు భక్తులకు మరింత సౌకర్యవంతంగా టికెట్లు జారీ చేయాలన్నారు. ఇందుకోసం గోకులం వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దాతల విభాగం పక్కనే ఉన్న ఆదిశేష విశ్రాంతి గృహంలో తాత్కాలిక శ్రీవాణిట్రస్టు దర్శన టికెట్ల జారీ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎఫ్‌వో కార్యాలయంలో పూర్తిస్థాయిలో శ్రీవాణి టికెట్ల జారీ కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో టికెట్లు జారీ కౌంటర్లు, 200 మంది భక్తులు వేచిఉండేందుకు సీటింగ్, పార్కింగ్, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తర్వాత ఈవో శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాలను, తిరుమలనంబి ఆలయం, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ఈవోతో పాటు జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్‌రెడ్డి, వీజీవో నందకిషోర్, ఇతర అధికారులు ఉన్నారు.

డబ్బు కోసం ఫ్రెండ్‌కే వల!

● బ్లాక్‌మెయిల్ కేసులో
లా విద్యార్థులైన దంపతులకు రిమాండు

తిరుపతి (నేరవిభాగం/విశ్వవిద్యాలయాలు),జూలై26: తిరుపతిలో ఓ లా విద్యార్థిని సస్పెండయ్యారు. ప్రస్తుతం ఐదేళ్ల లా ఇంటిగ్రేటెడ్ ఏడవ సెమిస్టర్ చదువుతూ బ్లాక్ మెయిల్ కేసులో ఇరుక్కున్న ఆమెను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలేనికి చెందిన కృష్ణకిషోర్ రెడ్డి తిరుపతిలోని పుదిపట్లలో వుంటూ బీఎల్ చదువుతున్నాడు. తమిళనాడుకు చెందిన ఈయన భార్య సదాశివం ప్రణవ్ కృష్ణ కూడా బీఎల్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.డబ్బు సంపాదన కోసం తన సహాధ్యాయి అయిన కర్నూలుకు చెందిన మహిళతో ప్రణవ్ కృష్ణ పరిచయం పెంచుకుంది.తన ఇంటికి తీసుకెళ్ళింది.కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చింది. ఆమె మత్తులో వున్నప్పుడు భర్త కృష్ణకిషోర్‌తో కలిపి అసభ్య ఫోటోలు,వీడియోలు తీసింది.వాటిని ఆ మహిళతో పాటు ఆమె అన్నకు, కాబోయే భర్తకు వీడియోలు, ఫోటోలు తీసి పంపింది. భర్తతో కలిసి పెద్దఎత్తున డబ్బులు డిమాండు చేసింది. పదే పదే వేధిస్తుండడంతో బాధిత మహిళ శుక్రవారం ఎంఆర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేశారు. నిందితులైన దంపతులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో రూ.5లక్షల డిమాండ్

● తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేసిన డీఎంహెచ్‌వో

తిరుపతి(వైద్యం), జూలై 26: సమతా సైనిక్ దళ్(ఎస్ఎస్‌డీ) సంస్థ పేరుతో బెదిరింపులకు గురి చేస్తూ రూ.5లక్షలు డిమాండ్ చేస్తున్నారంటూ డీఎంహెచ్‌వో శ్రీహరి శుక్రవారం తిరుతి ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కల్యాణ్, సుబ్రహ్మణ్యం, నాగేంద్రలు ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో తనను నగదు డిమాండ్ చేయడంతోపాటు ఇవ్వకుంటే తప్పుడు ప్రచారాలకు తెరలేపుతామని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా నేరుగా ఇంటికొచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కూడా ఎస్పీకి అందజేసినట్లు శ్రీహరి తెలిపారు.

ఫిర్యాదు చేసినందుకు కేసు పెట్టారు

వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరిపై సమతా సైనికదళ్ సంస్థ తరఫున కలెక్టర్‌కు, హెల్త్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై అక్రమ కేసులు పెడుతున్నారని, సమతా సైనికదళ్ జిల్లా కార్యదర్శి గండికోట సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము డీఎంహెచ్‌వోను ఎలాంటి నగదు డిమాండ్ చేయలేదని పేర్కొన్నారు.

ఆలయ ముఖద్వారాన్ని ఢీకొన్న లారీ

ఆర్చి దిమ్మె సహా ఏడు కిలోమీటర్లు వెళ్లాక ఆపేసి పరారైన డ్రైవరు



ధ్వంసమైన ఆలయ ముఖద్వారాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, స్థానికులు



ఆర్చి దిమ్మె సహా వచ్చిన లారీ

కల్లూరు, జూలై 26: పులిచెర్ల మండలం కల్లూరు-పీలేరు జాతీయ రహదారి ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ముఖద్వారాన్ని శుక్రవారం వేకువజామున లారీ ఢీకొంది. పీలేరు మండలం అగ్రహారంలో ఉన్న ఈ ఆలయానికి సంబంధించి ముఖద్వారాన్ని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిర్మించారు. అగ్రహారం వైపు నుంచి జాతీయ రహదారి వైపు చింతగింజల పొడి లోడుతో వస్తున్న లారీ శుక్రవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఈ ఆర్చిని ఢీకొంది. ముఖద్వారం పైభాగం సహా లారీ కల్లూరు వైపు సుమారు 7 కిలోమీటర్ల దూరం వచ్చాక.. రోడ్డు సమీపంలోని చింతచెట్టు వద్ద ఆపేసి డ్రైవర్ వెళ్లిపోయారు. ఉదయం చూసిన స్థానికులు కల్లూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీట్ సీట్ల కేటాయింపు డిజిటల్ సమాచారం సిద్ధం

తిరుపతి(విద్య), జూలై 26: నీట్ సీట్ల కేటాయింపుకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ బుక్‌లెట్ రూపంలో సిద్ధం చేసినట్టు తిరుపతిలోని ఐఐటీ, జేఈఈ నీట్ ఫోరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. నీట్-2024 పరీక్ష రాసిన విద్యార్థులకు సీట్ల కేటాయింపుపై ఓ అవగాహనకోసం నీట్-2023 సీట్ల కేటాయింపు జరిగిన సమాచారాన్ని ఇందులో పొందుపరిచినట్టు వెల్లడించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ రౌండ్ 1, రౌండ్ 2, మాప్ అప్ రౌండ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ర్యాంకు, రిజర్వేషన్ వారీగా సీట్ల కేటాయింపును క్రోడీకరించి బుక్‌లెట్‌ను సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ బుక్‌లెట్‌కోసం, మరింత సమాచారం కోసం నీట్ సీట్ అని టైప్ చేసి 98490 16661 నెంబరుకు వాట్సాప్ మెసేజ్ పంపాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

పుంగనూరు, జూలై 26: పుంగనూరు ఎన్ఎస్‌పేటలోని రామ్‌నగర్ కాలనీలో పోలీసులు రూ.1.57లక్షలు విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. స్థానిక రామ్ నగర్‌లోని మహ్మద్ ఇద్రాస్ (17) ఇంటర్ ఫెయిలయ్యాడు. ఖాళీగా ఉండేవాడు. ఎన్ఎస్‌పేటకు చెందిన అబ్రీ తల్లిదండ్రులు బెంగళూరులో కూలి చేసుకుని జీవిస్తున్నారు. అబ్రీ పుంగనూరులో ఒక్కడే ఉండేవాడు. ఇతడు జూదానికి, మద్యానికి బానిసయ్యాడు. డబ్బుకోసం పలుచోట్ల మోటారు సైకిళ్లు చోరీచేసిన కేసులో నిందితుడు. ఈ క్రమంలో మహ్మద్ ఇద్రాస్, అబ్రీ మధ్య పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి కర్ణాటక మద్యం తక్కువకు తెచ్చి ఇక్కడ ఎక్కువకు విక్రయించేవారు. ఈ క్రమంలో మహ్మద్ ఇద్రాస్ తమ ఇంటి మిద్దెపై వాటర్ ట్యాంకు కింద కర్ణాటక మద్యం దాచి ఉంచాడు. రహస్య సమాచారంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మద్యం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

10 మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం



స్మగ్లర్ల వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జూలై 26: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన బృందం దొరవారిసత్రం-నాయుడుపేట అటవీ ప్రాంతంవైపు శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. అక్కడినుంచి సూళ్లూరుపేట బీటు పరిధిలోని తల్లంపాడు గ్రామం సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అటువైపు వచ్చిన రెండు కార్లు వీరిని చూసి కొద్దిదూరంలోనే ఆపేసి, అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి పది మంది పట్టుకున్నారు. వీరు.. తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన రాజమణి గోవిందస్వామి (41), విజయకుమార్ (32), శివకుమార్ వెల్లియన్ (26), కుమార్ ముత్తు (29), అరుల్ ముత్తుస్వామి (23), ప్రభు రాజీ (25), అశోక్ కుమార్ (29), ఎం.గోపి (26), జ్ఞానశేఖర్ చిన్నతంబి (19), పూవరాసన్ వరదన్ (27)గా గుర్తించారు. పరారైన మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. అలాగే కార్లలోని ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, వాహనాలను సీజ్ చేశారు.

జూపార్కు వద్ద మరో ముగ్గురి అరెస్టు: ఏడు దుంగల స్వాధీనం

జూపార్కు ప్రహరీ వద్ద మరో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఏడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ(ఆపరేషన్స్) సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన విశ్వనాథ్ బృందం గురువారం సాయంత్రం నుంచి శ్రీవారి మెట్టు పార్కింగ్ నుంచి జూపార్కు వైపు కూంబింగ్ చేపట్టారు. జూపార్కు ప్రహరీ వద్ద కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ తారసపడ్డారు. అదేసమయంలో టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి స్మగ్లర్లు కారును వదలి పారిపోయారు. కారులో చూడగా నాలుగు ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటితోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిరుమల రెండో ఘాట్‌లోని 36వ కల్వర్టు వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా, జూపార్కు వద్ద పరారైన స్మగ్లర్లను గుర్తించారు. అనంతరం వీరు సమీపంలో దాచి ఉంచిన మరో మూడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన గోపి అయ్యాకన్ను(26), శివరాజ్ మాణిక్యం(39), గోవిందరాజ్(32)గా గుర్తించారు. ఈ రెండు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి.. సీఐ శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌లు దర్యాప్తు చేపట్టారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పారిశుధ్య నిర్వహణపై కడా పీడీ ప్రత్యేక దృష్టి



పూల వ్యాపారులతో మాట్లాడుతున్న కడా పీడీ

కుప్పం, జూలై 26: కుప్పంలో పారిశుధ్య నిర్వహణపై కడా పీడీ వికాస్ మర్మత్ ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాస రావుతో కలిసి ఆయన శుక్రవారం ఉదయం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. నేతాజీ రోడ్డులోని పూల దుకాణదారులు, ఇతర చిరు వ్యాపారస్తులను కలిసి మాట్లాడారు. వ్యర్థాలను రోడ్డు మీద పడేయ రాదని, చెత్తబుట్టలో వేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అంగన్వాడీ ఇంటర్వ్యూలకు 77 మంది హాజరు



పలమనేరు, జూలై26 : పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన అంగన్వాడీ పోస్టుల ఇంటర్వ్యూలకు మొత్తం 77 మంది హాజరయ్యారు. ఆర్డీఓ మనోజ్ కుమార్‌రెడ్డి, డీఎం అండ్ హెచ్ఓ హనుమంతరావు, పలమనేరు, పుంగనూరు, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం సీడీపీఓలు ఇందిరాప్రియదర్శిని,రాజేశ్వరి, మాధవీలత, వాణిశ్రీలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బంగారు పాళ్యం, పలమనేరు, పుంగనూరు, బైరెడ్డిపల్లి, పులిచెర్ల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులు-6, మినీవర్కర్ పోస్టులు- 5, హెల్పర్ పోస్టులు-22 లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఘనంగా అక్కదేవతల పూజలు



పెద్దపంజాణి, జూలై 26: మండలంలోని రాయలపేటలో అక్కదేవతల పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢమాసంలో ఈ పూజా కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామస్తులు గ్రామ సమీపంలోని అక్కదేవతల ఆల యం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు పట్టాభి రామయ్య, సుబ్రమణ్యం, గాండ్లక్రిష్ణప్ప, శివశంకర, మేస్త్రి ఆనంద, దామోదర, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి



టీడీపీ నాయకులను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

రామకుప్పం, జూలై 26: ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ రామకుప్పం మండలం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండల యూటీఎఫ్ నేతలు పాల్‌దేవ్, రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు టీడీపీ కార్యాలయంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంకటాచలం, వెంకటరమణ, పెరుమాళ్, మురళి, రఘు, పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

శెట్టిపల్లె పంచాయతీలో పారిశుధ్య పనులు



గుడుపల్లె, జూలై 26: మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం సర్పంచ్ యల్లప్ప ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. వీధుల్లో అక్కడక్కడా పేరుకుపోయిన చెత్తదిబ్బలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కాలువలో ఉన్న మురుగు, చెత్తలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మందులను స్ప్రే చేయించారు. ఆ తరువాత గ్రామాల్లో ఆరోగ్య మిత్రలు ఇంటింటా తిరిగి విషజ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యమైన ఆహారం

పలమనేరు, జూలై26 : సేంద్రియ విధానంలో సాగుచేస్తే ఆరోగ్యకరమైన పంటలు పండించ వచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు టీపీ.నాగపద్మిని, పలమనేరు డివిజన్ ఏడీ అన్నపూర్ణాదేవి తెలియజేశారు. శుక్రవారం మండలంలోని కూర్మాయి గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో వాతావరణ ఆధారిత వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, భూసారపరీక్ష ఆధారిత ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సేంద్రియ ఎరువులతో సాగు, మట్టినమూనా సేకరణ, విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, పలమనేరు మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నమల్లయ్య తాత ఆలయంలో అభిషేకపూజ

సోమల, జూలై 26: మండలంలోని కరకమందలో కొలువుదీరిన చెన్నమల్లయ్య తాత ఆలయంలో బ్రహ్మోత్సవాలు సందర్భంగా శుక్రవారం మూలవిరాట్‌కు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి అభిషేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలోని నాగ దేవతల ఆలయం వద్దకు భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. కాగా శనివారం, ఆదివారం గ్రామంలోని ఎల్లమ్మ దేవత కొలుపు ఉత్సవాలు సందర్భంగా ఆలయాన్ని సుందరంగా పచ్చనితోరణాలు, విద్యుత్ దీపాలంకరణలు చురుగ్గా చేపట్టారు. ఉత్సవాల నిర్వహణపై ఉభయదారుడు మునిరాజ గ్రామ కమిటీ సభ్యులతో సమీక్షించారు.

తాపీమేస్త్రీ ఆత్మహత్య

పలమనేరు, జూలై 26: ఆర్థిక లావాదేవీలతో తాపీమేస్త్రీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని జగమర్ల అటవీ ప్రాంతంలో గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు...బంగారుపాళానికి నాగరాజు తాపీమేస్త్రీ. ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంలో భాగంగా బంగారుపాళెంలోని సిమెంటు షాపులో కొంత అప్పుచేశాడు. ఈ విషయంపై సిమెంట్ షాపు యజమానితో రెండు రోజుల క్రితం గొడవపడి ఇంటినుంచి వచ్చేశాడు. జగమర్ల అడవిలో ఓట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం పశువుల కాపరులు గుర్తించి పలమనేరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాకంబరీ అలంకరణలో చౌడేశ్వరి దేవి



సదుం, జూలై 26: స్థానిక జాండ్రపేటలో వెలసి ఉన్న రామ లింగ చౌడేశ్వ రిదేవి ఆలయంలో ఆషాఢ మాస పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మ వారిని కూర గాయలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్థానికులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు రఘునాథశర్మ, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆగిన చెత్తబుట్టల పంపిణీ



రొంపిచెర్ల, జూలై26: డీపీవో ఆదేశాలు రాకపోవడంతో చెత్తబుట్టల పంపిణీ ఆగిపోయింది. మండలంలోని పది పంచాయతీలకు 21,460 చెత్తబుట్టలు వచ్చాయి. ఎంపీడీవో కార్యాలయానికి నెలక్రితమే వచ్చాయి. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడానికి వీటిని ఇంటింటికీ పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇవి వచ్చి నెలరోజులైనా ఇంత వరకు పంపిణీ చేయలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తామని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలియజేశారు.

మురుగునీటి ప్రవాహంతో అపరిశుభ్రత



రొంపిచెర్ల, జూలై26: మండలంలోని చెంచమరెడ్డిగారిపల్లెలో మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 65 కుటుంబాలు ఉన్నాయి. సీసీ రోడ్లు వేసి మురుగునీటి కాలువల నిర్మాణం మరిచారు. ఈ క్రమంలో తాగునీటి కొళాయిల వద్ద వెళ్లే వృథానీరు, ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలు, వీధుల్లో ప్రవహించి పలుచోట్ల నిలిచిపోతున్నాయి. దోమలకు ఆవాసంగా మారాయి. జనం రోగాలు బారినపడే ప్రమాదం ఉంది.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, జూలై26 :పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, జూలై26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రీతికరమైన ఆషాఢ శుక్రవారం సందర్భంగా శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల అభిషేక పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, జూలై26: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేకంగా పూల అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

భువనేశ్వరి పర్యటన విజయవంతం



కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న భువనేశ్వరి

కుప్పం, జూలై 26: ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజులపాటు చేసిన పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఈ నాలుగు రోజులపాటు ఆమె నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి సాధకబాధకాలను పంచుకున్నారు. మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ ట్రస్టు అందుకు సాయం చేస్తుందని, దానితోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వినియోగించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా చంద్రబాబుకు అత్యధిక మెజారిటీ తెచ్చిన గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లె, కుప్పం మండలం పైపాళ్యం గ్రామాలను భువనేశ్వరి దత్తత తీసుకుని ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అంతేగాక కుప్పంలో మహిళలకు ప్రత్యేకంగా ఎన్టీఆర్ ట్రస్టు తరఫున స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ట్రస్టు ద్వారా ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలను కుప్పంలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పర్యటన పర్యంతంగా గ్రామగ్రామానా మహిళలు భువనేశ్వరికి మంగళ హారతులు, పూల మాలలు, పూర్ణకుంభాలతో సాదర స్వాగతం పలికి, ఆమెమీద తమ అభిమానాన్ని చాటుకున్నారు. నాలుగు రోజుల భువనేశ్వరి పర్యటనలో ప్రజలనుంచి మొత్తం 977 వినతులు ఆమెకు అందాయి. ఇందులో అత్యధికం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే కావడం గమనార్హం. ఆయా సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈనెల 23వ తేదీన గుడుపల్లె మండలం నుంచి ప్రారంభమైన భువనేశ్వరి పర్యటన, చివరి రోజైన శుక్రవారం పీఈఎస్ ఆడిటోరియంలో మహిళలకు కుట్టు మిషన్లు, తోపుడు బండ్ల పంపిణీతో ముగిసింది. మధ్యాహ్నం భువనేశ్వరి బెంగళూరు బయలుదేరి వెళ్లారు. అక్కడినుంచి ఆమె అమరావతి చేరుకుంటారు.

● **గంగమ్మ ఆలయంలో పూజలు:**

భువనేశ్వరి శుక్రవారం కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికలకు ముందు కూడా ఆమె ఈ ఆలయానికి వచ్చి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఇప్పుడు విజయం సాధించిన తర్వాత మళ్లీ ఆలయానికి వచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూలు, అభిషేకాలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఇతర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో విశేషపూజలు



గోరింటాకు అలంకారంలో కన్యకాపరమేశ్వరి

బైరెడ్డిపల్లె, జూలై 26: బైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగేంద్ర అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు జరిపారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ● వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి గోరింటాకు అలంకారం చేశారు. అర్చకులు రామకృష్ణాచార్యులు పూజలు నిర్వహించారు. వాసవీ ఫౌండేషన్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● స్థానిక సల్లాపురమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు జరిగాయి. ● దేవదొడ్డి గ్రామంలోని అంకాళపరమేశ్వరీ ఆలయంలో గ్రామస్తులు విశేషపూజలు చేశారు.

తిరుమలలో సోమల కళాకారుల సంకీర్తనలు



సోమల, జూలై 26: సోమల జానపద కళాకారుల బృందానికి తిరుమల అఖండ హరినామ సంకీర్తనలు ఆలపించడానికి అవకాశం లభించింది. తిరుమలలో శుక్రవారం సోమల కళాకారులు తమ బృంద సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. కళాకారుల సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాకారులు వీ.ఎంసీ. మునిచంద్ర, మునివెంకటప్ప, మునిరాజ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో విత్తనశుద్ధి ముఖ్యం



బైరెడ్డిపల్లె, జూలై 26 : వేరుశనగ సాగులో విత్తన శుద్ధి ముఖ్యమని చిత్తూరు రైతు వనరుల కేంద్రం సహాయ వ్యవసాయసంచాలకులు నాగపద్మిని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాచుకుప్పం గ్రామ సమీపంలోని పొలాల వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, విత్తన మోతాదు, ఎరువుల వినియోగం, అంతర పంటల ప్రాముఖ్యత గురించి వివరించారు. పూతదశలో ఉన్న పంటలో ఎకరాకు 200 కిలోల జిప్సం వాడితే దిగుబడి పెరగడంతో పాటు గింజనాణ్యత వృద్ధి చెందుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి గీత, సిబ్బంది పాల్గొన్నారు.

జంబుగుండ్లపల్లెలో వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, జూలై 26 : మండలంలోని జంబుగుండ్లపల్లె గ్రామంలో శుక్రవారం తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. పలువురికి వైద్యపరీక్షలు జరిపి అవసరమైన వారికి మందులు పంపిణీచేశారు. జ్వరాల నివారణ, పరిసరాల శుభ్రత, చేతులశుభ్రత, కుష్ఠువ్యాధి నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నవీన, ఏఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు మునిలక్ష్మమ్మ, రామాంజమ్మ పాల్గొన్నారు. ● బైరెడ్డిపల్లెలోని బీసీ హాస్టల్లో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహార ప్రాముఖ్యత, అతిసారవ్యాధి నివారణచర్యలు, చేతుల శుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ జైకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



గుడుపల్లె, జులై 26: మండల పరిధిలోని గుడివంక కొండపై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం స్వామివారి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగుల రంగుల పుష్పాలతో స్వామి అమ్మవార్లను అలంకరించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, అర్చనలు చేయిం చుకున్నారు. రాత్రి చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు స్వామివారికి నలుగులు తీసుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని స్వామివారి ఎదుట ఉంచారు. వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు అనేక గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

పాటు కాటుతో మహిళకు అస్వస్థత

పుంగనూరు రూరల్, జూలై26: పొలం పనులు చేస్తున్న మహిళను పాము కాటు వేయడంతో ఆమె అస్వస్థతకు గురైంది. చౌడేపల్లె మండలం గడ్డంవారిపల్లెకు చెందిన మున్నా భార్య పుజా(31) పొలం పనులు చేస్తుండగా పాము కాటువేసింది. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతుల సాయంతో కుటుంబసభ్యులు ఆమెను చౌడేపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కేసుల ఎత్తివేత ప్రకటనపై ఎస్టీయూ హర్షం

పుంగనూరు రూరల్, జూలై 26: సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తి వేసేలా చూస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తామని నమ్మించి మోసం చేయడంతో పాటు ఆందోళన చేపట్టిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై అనేక కేసులు నమోదు చేసిందని గుర్తుచేశారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



భోజనం చేస్తున్న డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం

పుంగనూరు రూరల్, జూలై26: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజన పథకంలో నాణ్యత పాటించాలని మదనపల్లె డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం సూచించారు. శుక్రవారం మండలంలోని గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. పిల్లలతో కలసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నాడు-నేడు పథకంలో నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం మహేశ్‌నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

పుంగనూరు, జూలై26: పుంగనూరులో పారిశుధ్య పనులను ముమ్మరం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రహమత్‌నగర్, గోకుల్ పరిధిలోని మురుగు కాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్, ఫినాయిల్ పిచికారీ చేయించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, మేస్త్రీలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌యూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



గుడుపల్లె, జులై 26: సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ శుక్రవారం పీఈఎస్ కళాశాల ఆడిటోరియంలో టీఎన్‌యూఎస్ ఉపాధ్యాయ సంఘం వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్క రిం చారు. సంఘం నేతలు, ఉపాధ్యాయులు భువ నేశ్వరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ, కుప్పం మండల అధ్యక్షులు అమరజ్యోతి, కార్యదర్శి శ్రీనివాసరావు, గుడుపల్లె మండల అధ్యక్షుడు కుమార్‌బాబు, కార్యదర్శి జగదీశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29న ఆడికృత్తిక

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లె సమీపంలోని యోగనందీశ్వరాలయం, నాగిరెడ్డిపల్లె సమీపంలో కొలువైన మునీశ్వరాలయం, బందార్లపల్లె సమీ పంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ఈనెల 29న ఆడి కృత్తిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

బంగారు తిరుత్తణి కొండపై ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం

సోమల, జూలై 26: సోమల బంగారు తిరుత్తణి కొండలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యంస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. ఇందులోభాగంగా వినాయకస్వామి ఆలయంలో గణపతి పూజ, కంకణధారణ కార్యక్రమాలు నిర్వహించారు. 27న ఉదయం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణం, పట్టణ పురవీధుల్లో స్వామివారి పల్లకి సేవలు జరుగనున్నాయి. ఆలయ ధర్మకర్త రఘుపతి పద్మావతమ్మ కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.

140 మందికి కంటి పరీక్షలు

రామకుప్పం, జూలై 26: విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక కంటిపరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ పరీక్షల్లో 140 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు పూజిత, సాయిశ్రీ హెల్త్‌అసిస్టెంట్ బాలు, బాలచందర్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి

పలమనేరు, జూలై26 : పలమనేరులో శుక్రవారం పలమనేరు పరిరక్షణ సమితి, మాజీ సైనికోద్యోగులు కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరులకు నివాళులు అర్పించారు. జాతీయ రహదారిపై జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. రాత్రి ఎన్జీఓ హోం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో పీపీఎస్ అధ్యక్షులు సుబ్రమణ్యం, కార్యదర్శి నరసింహులు, బీజేపీ పట్టణ కన్వీనర్ తాతయ్యనాయుడు, ఏపీఎన్జీఓ సంఘ నాయకులు ఆనందబాబు, మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు పయని, పీపీఎస్ సభ్యులు, సామాజిక కార్యకర్త మధు మోహన్‌రావు, యోగా గురువు నందగోపాల్ పాల్గొన్నారు.

● కార్గిల్ యుద్ధంలో అమరులైన వారికి పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు అంజలి ఘటించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ బాలాజీ, సీపీడీఎస్ సభ్యులు సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు సుబ్బయ్యనాయుడు, కిరణ్ కుమార్, చిదంబరం, ఇంతియాజ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన 527 మంది వీరజవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

సోమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు సంయుక్తంగా అమరవీరులకు నివాళులర్పించారు.







పలమనేరులో క్యాండిల్ ర్యాలీ ● కల్లూరు పాఠశాలలో కొవ్వొత్తులతో అమరవీరులకు నివాళులు ● సోమల కళాశాలలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

లక్ష్యం ఘనం..ఆచరణ శూన్యం

● మచ్చుకైనా కానరాని చెత్త సేకరణ ● నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు


మారేపల్లి కేంద్రంలో నిండిపోయిన పిచ్చిమొక్కలు


నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

వెదురుకుప్పం, జూలై 26: ఇంటింటా చెత్త సేకరణ లక్ష్యం మంచిదే అయినా ఆచరణలో మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు. ఏళ్ల గడిచినా ఇంకా చాలాచోట్ల చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించలేదు. నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలో 25 గ్రామ పంచాయతీలు 222 హేబిటేషన్లు ఉన్నాయి. ఈ గ్రామాల్లో చెత్త సేకరించి, తద్వారా సంపద సృష్టించాలి. తడి, పొడి చెత్తను వేరుచేసి, వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలి. కానీ మండలంలో అలా జరగడం లేదు. ఇప్పటివరకు రూ.7,500 ఆదాయం వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

నిరుపయోగంగా సేకరణ కేంద్రాలు

మండలంలో ఇరవై చోట్ల చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించారు. చెత్త సేకరణ లేకపోవడంతో ఇవి నిరుపయోగంగా మారాయి. మారేపల్లి కేంద్రం దుస్థితి చూస్తే అక్కడ చెత్త సేకరించడం లేదన్న నిజం బయటపడుతుంది. పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి జీతాలు సరిగా ఇవ్వకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఐదుచోట్ల స్థలమే కరువంట

మండలంలో ఎక్కడ చూసినా ప్రభుత్వ భూములు, బంజరులు ఉన్నా స్థలం లేదన్న సాకుతో చాలాచోట్ల చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణమే చేపట్టలేదు. గంటావారిపల్లి, మొండివెంగనపల్లి, దేవరగుడిపల్లి, ఇనాంకొత్తూరు, యనమలమంద తదితర గ్రామాల్లో స్థలం కేటాయించని కారణంగా పనులు జరగలేదన్నది అధికార యంత్రాంగం చెబుతున్న మాట. గంటావారిపల్లె ఎంపీపీ నాగరాణి(వైసీపీ) సొంత గ్రామం కావడం గమనార్హం.

చెత్త సేకరణకు చర్యలు చేపడతాం

మండలంలో చెత్త సేకరణ ఆగిన మాట నిజమే. పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. గంటావారిపల్లె, మొండివెంగనపల్లె, దేవరగుడిపల్లె, ఇనాం కొత్తూరు, యనమలమంద పంచాయతీల్లో నిధులు, స్థలం కేటాయిస్తే చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడతాం.

\- పురుషోత్తం, ఈవోపీఆర్డీ

వేరుశనగలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం


రైతులకు సూచనలిస్తున్న మురళీకృష్ణ

ఐరాల, జూలై 25 : యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వేరుశనగ పంటలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పొలకలలో శుక్రవారం రమేష్ పొలంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన మందులు, ఎరువులు వినియోగించకుండా సేంద్రియ పద్ధతి ద్వారా పంటలు పండించాలని సూచించారు. అవసరం మేరకు కషాయాలు వాడాలన్నారు. ఘన, ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకుని వినియోగించాలన్నారు. ఏడీఏ ఉమా, ఎంఏవో వరలక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ హనుమంతు పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ దుకాణాల ఖాళీ


ఖాళీ చేయిస్తున్న అధికారులు

చిత్తూరు కల్చరల్, జూలై 26: చర్చి వీధిలోని జీవకారుణ్య అన్నదాన సమాజంలో గల దుకాణాలను ఎండోమెంట్ ఏసీ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసు బందోబస్తు నడుమ ఖాళీ చేయించారు. 8 దుకాణాలను ఖాళీ చేయించి, తాళాలు స్వాధీనం చేసుకున్నారు. ఈవోలు మునిశేఖర్, సుబ్రమణ్యంనాయుడు, సుబ్బారెడ్డి, జీవకారుణ్య అన్నదాన సమాజ ఈవో తిమ్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, గీత, చెంగల్‌రాయలు పాల్గొన్నారు.

ఘనంగా రెండో శుక్రవార పూజలు


నాగాలమ్మకు పూజలు చేస్తున్న కరుణాకరన్ దంపతులు

చిత్తూరు కల్చరల్, జూలై 26 : నగరంలోని పలు ఆలయాల్లో రెండో శుక్రవార పూజలను ఘనంగా నిర్వహించారు. గుర్రప్పనాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి ఆలయంలో అర్చకుడు కుమార్ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతపేట నాగాలమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త కరుణాకరన్ దంపతులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. చవటపల్లె కనకదుర్గాలయంలో అమ్మవారు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో పూజలు, దీపారాధనలు చేశారు.

పిన్నయమ్మ ఆలయంలో కైలాసగిరి వ్రతం

చిత్తూరు కల్చరల్, జూలై 26: స్థానిక పిన్నయమ్మ ఆలయంలో శుక్రవారం కైలాసగిరి వ్రతం నిర్వహించారు. వందలాది మంది ముత్తైదువులు పాల్గొని వ్రతమాచరించారు. ఆలయ ధర్మకర్త సీకే లావణ్యబాబు పాల్గొన్నారు. అర్చకుడు కేదారేశ్వర గురుకుల్ భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పదో తరగతి టాపర్‌కు నగదు బహుమతి


ప్రోత్సాహకం అందజేస్తున్న ఎంఈవో

పాలసముద్రం, జూలై 26 : పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన ఎం.రక్షితకు ఎంఈవో రాజేంద్రప్రసాద్ శుక్రవారం జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఎంఈవో-2 గిరిజ, ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు స్వామిరాజు పాల్గొన్నారు.

ఆడికృత్తికకు ప్రత్యేక బస్సులు నడపాలి

పాలసముద్రం, జూలై 26 : ఆడికృత్తికను పురస్కరించుకుని ఆది, సోమవారాల్లో తమిళనాడు తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలో ప్రత్యేక బస్సులు నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడంతో ఇక్కడి నుంచి ఆదివారం భరణి, సోమవారం కృత్తిక కావళ్లు తీసుకుని అధిక సంఖ్యలో భక్తులు వెళుతుంటారని, వారి సౌకర్యార్థం బస్సులు నడపాలని కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



శ్రీరంగరాజపురం, జూలై 26: 49.కొత్తపల్లె బీసీ కాలనీలో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో ఇళ్ల మధ్యలో నీరు నిల్వ చేరుతోంది. పారిశుధ్యం పూర్తిగా లోపిస్తోంది. దోమలు వ్యాప్తి చెంది రోగాలకు దారి తీస్తున్నాయి. పిల్లలు జ్వరాలతో బాధపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంట్లోకి ప్రవేశించిన నాగుపాము పట్టివేత



నగరి, జూలై 26 : ఏకాంబరకుప్పంలో కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లోకి నాగుపాము చొరబడింది. దాదాపు గంటపాటు అటూఇటూ తిరుగుతూ హల్‌చల్ చేసింది. ఇంటి యజమాని పాములు పట్టే వ్యక్తిని పిలిపించి దాన్ని పట్టించి, సమీపంలోని అడవిలో వదిలేశారు.

నేటి నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు

కార్వేటినగరం, జూలై 26: కొమరగిరిపై వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. 31వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం నీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు. పుష్కరిణిలో తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ ఈవో కృష్ణ నాయక్ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

నింద్ర, జూలై 26: వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చవరంబాకం సర్పంచ్ మనోహర్‌నాయుడు సూచించారు. శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శి, వార్డు మెంబర్లతో సమావేశమయ్యారు. హరిజనవాడ, గ్రామంలో చెత్తదిబ్బలు తొలగించారు. డ్రైనేజీలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించారు. ఈవోపీఆర్డీ వెంకటేశులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

తవణంపల్లె, జూలై 26: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో హేమలత సూచించారు. మండలంలోని కాణిపాకపట్నం పాఠశాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సీఆర్పీ గోపి పాల్గొన్నారు.

రోడ్డు పక్కన పిచ్చిమొక్కల తొలగింపు



గుడిపాల, జూలై 26: మండలంలోని పలు రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను రామభద్రాపురం సర్పంచ్ హరిణి హేమాద్రి నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. మొక్కల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో ఆయన స్పందించి జేసీబీ సాయంతో చుక్కావారిపల్లి రహదారిలో తొలగించారు. మాజీ సర్పంచ్ పళని, టీడీపీ నేత శేఖర్ పాల్గొన్నారు.

డ్రై డేతప్పక పాటించాలి


నీటిని పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, జూలై 26: ప్రతి శుక్రవారాన్నీ డ్రైడేగా పాటించాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రశాంత్ నగర్‌లో జరుగు తున్న డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. సంపులు, డ్రమ్ములను పరిశీలించారు. ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వల్ల అనేక జబ్బులు వస్తాయని తెలిపారు. దోమ తెరలు, వేపాకుతో రక్షణ పొందాలన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

గంగాధరనెల్లూరు, జూలై 26: మండలంలోని కోటాగరం పంచాయతీ ఎట్టేరి వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలకు శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. 28న అభిషేక పూజలు, భరణి కావడి చెల్లింపులు, 29న పాలాభిషేకం, కావడి చెల్లింపులు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం 100 గొల్లపల్లె జైన్ ఫామ్ ఫ్రెష్ ఫ్యాక్టరీ, చిత్తూరు నగరానికి చెందిన ఓ.ఎం.రామదాసు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం రాత్రి ద్రౌపదీ మాన సంరక్షణ వీధినాటకం ఉంటుందన్నారు.

● సిద్దేశ్వరకొండలో ఆడికృత్తిక మహోత్సవం

వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఈ నెల 28, 29 తేదీల్లో ఆడికృత్తిక మహోత్సవం జరుగుతుందని ధర్మకర్త ఎ.నరసింహారెడ్డి తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

కాలం చెల్లిన మందుల స్వాధీనం


క్లినిక్‌లో తనిఖీలు చేస్తున్న బాలసుబ్రమణ్యంరెడ్డి

శ్రీరంగరాజపురం, జూలై 26 : ఆరిమాకులపల్లె ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్ర మణ్యంరెడ్డి తన సిబ్బందితో శుక్రవారం ప్రైవేటు క్లినిక్స్‌లో తనిఖీలు నిర్వహించారు. 49.కొత్తపల్లె మిట్టలోని క్లినిక్స్‌లో కాలం చెల్లిన మందులు, ఇంజక్షన్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఇకపై ఇలాంటివి దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. మండలంలోని పలువురు ఆర్ఎంపీ, పీఎంపీలు రోగులకు మోతాదుకు మించిన మందులు, ఇంజక్షన్లు ఇస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, రుజువైతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.కవిత, హెల్త్ అసిస్టెంట్ రామ్మోహన్, ఫార్మసిస్ట్ నరేష్, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధిలో ఉద్యాన పంటలకు ప్రాధాన్యం


కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజశేఖర్

నగరి/నింద్ర/విజయపురం, జూలై 26: జాతీయ ఉపాధి హామీ పథకంలో పూలు, పండ్లతోట పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని డ్వామా పీడీ రాజశేఖర్ సూచించారు. నగరి మండలం వేలావడి, బుగ్గ అగ్రహారంలో నీటికుంట పనులను, నింద్ర మండలం కూనమరాజుపాళెం, అత్తూరులో చేపలకుంట పనులను పరిశీలించారు. విజయపురం మండలం ఆలపాకం, ఒరూరు గ్రామాల్లో ఉపాధి పనులను ఏపీడీ శోభన్‌బాబుతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అనుసంధానమయ్యే విధంగా పనులు కల్పించాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ 100 రోజులు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి కుంటలు, మినీ అమృత సరోవర్, సరిహద్దు కందకాలు, పంట కాలువ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విజయపురం, నగరి ఏపీవోలు బబిత, కవిత, ఈసీ శ్రీధర్, జేఈలు కిశోర్, మధుబాబుపాల్గొన్నారు.

ఆశయ సాధనలో యువత ముందుండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

నగరి, జూలై 26: ఆశయ సాధనలో యువత ముందుకెళ్లాలని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టుదలతో శ్రమిస్తే విజయం సొంతమవుతుం దన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటా వెంకటచలపతి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తే విజయం సాధిస్తారని అన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, అధ్యాపకులు సుబ్రమణ్యం, ఇందిరాప్రియదర్శిని, వేణుగోపాల్, మహేశ్వరి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాల కోసం 10 నుంచి దీక్షలు

చిత్తూరు రూరల్, జూలై 26: స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఆగస్టు 10 నుంచి దీక్షలు చేయనున్నట్లు ఏపీ స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే స్వచ్ఛభారత్ కార్మికులకు 25 నెలల పాటు జీతాలు పెండింగ్ ఉంచడం దారుణమన్నారు. జీతాలను వెంటనే విడుదల చేయాలని, కార్మికులందరూ పాల్గొని దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఒలంపిక్స్‌పై ప్రచారం చేయండి



చిత్తూరు రూరల్, జూలై 26: ప్యారిస్‌లో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఒలంపిక్స్‌పై క్రీడాకారులకు, పౌరులకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం చేయాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సెల్ఫీ, స్టాండీస్‌తో ఫొటోలు తీసే కార్యక్రమం చేయించాలని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాండీస్‌తో కలెక్టర్ ఫొటో దిగారు.

కృత్రిమ అవయవాలకు 220 మంది ఎంపిక

చిత్తూరు, జూలై 26: కృతిమ అవయవాల కోసం శుక్రవారం అపోలో ఆవరణలో ఫ్రీడమ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. 231 మంది హాజరుకాగా 220 మందిని ఎంపిక చేశారు. వారి కొలతలు తీసుకున్నారు. మిగిలిన 11 మందికి పూర్తి స్థాయిలో వికలత్వం ఉన్నందున కృత్రిమ కాలును అమర్చలేమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకుడు సుదర్శన్‌రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, సీఆర్ అండ్‌ఎంవో జీకే రాజశేఖర్ నాయుడు, కార్యాలయ సిబ్బంది సొహైల్ పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన



చిత్తూరు సిటీ, జూలై 26: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత దయారాం చెప్పారు. శుక్రవారం స్థానిక గాంధీ సర్కిల్‌లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువగా పార్టీ సభ్యత్వం తీసుకుంటోందని పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 600 సభ్యత్వాలు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు యశ్వంత్, వెంకటేష్, దేవినేని భరత్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ

చిత్తూరు, జూలై 27: మహిళలు వారి హక్కులను రక్షించుకోవడానికి చట్టాలపై అవగాహన తెచ్చుకోవడం అవసరమని సెబ్ ఏఎస్పీ సుబ్బరాజు చెప్పారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలు-నివారణ చట్టాలపై శుక్రవారం చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడానికి పోలీసు శాఖ ముందుంటుందన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించే విధానం గురించి వివరించారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ శాంతమ్మ, సెబ్ సీఐ విజయ్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



బంగారుపాళ్యం, జూలై 26: మండలంలోని శేషాపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మురళి నాయుడు, చరణ్‌లు తమ సొంత నిధులతో విద్యాసామగ్రి వితరణ చేశారు. వేణునాయుడు, తులసి, విశ్వ, జశ్వంత్, నితిన్, షణ్ముగం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బంగారుపాళ్యం, జూలై 26: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు మండలాభివృద్ధి అధికారి శివకుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంటువ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, జ్వర పీడితులుంటే రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మతిస్థిమితంలేని మహిళ అమ్మఒడికి..


మహిళతో ఆశ్రమ నిర్వాహకులు

తవణంపల్లె, జూలై 26: మండలంలోని అరగొండ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న మతి స్థిమితం లేని మహిళను శనివారం పోలీసు స్టేషనుకు తరలించి, అక్కడి నుంచి చిత్తూరు అమ్మఒడి ఆశ్రమానికి తరలించారు. పేరు ముత్తువల్లి అని మాత్రమే చెబుతుండడంతో పూర్తి వివరాలు తెలిసే వరకు సంరక్షణ నిమిత్తం అమ్మఒడి నిర్వాహకులు పద్మనాభనాయుడు సహకారంతో ఆశ్రమానికి తరలించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

తాపీమేస్త్రీ ఆత్మహత్య

పలమనేరు, జూలై 26: ఆర్థిక లావాదేవీలతో తాపీమేస్త్రీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని జగమర్ల అటవీ ప్రాంతంలో గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు...బంగారుపాళానికి నాగరాజు తాపీమేస్త్రీ. ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంలో భాగంగా బంగారుపాళెంలోని సిమెంటు షాపులో కొంత అప్పుచేశాడు. ఈ విషయంపై సిమెంట్ షాపు యజమానితో రెండు రోజుల క్రితం గొడవపడి ఇంటినుంచి వచ్చేశాడు. జగమర్ల అడవిలో ఓట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం పశువుల కాపరులు గుర్తించి పలమనేరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభు త్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందూ ధర్మం ఆచరణీయమైంది


మాట్లాడుతున్న రాధా మనోహర్‌దాస్

చిత్తూరు కల్చరల్, జూలై 26: అన్ని ధర్మాలకు మూలం హిందూ ధర్మమని, అందుకే అది అనుసరణీయమైందని అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధా మనోహర్ దాస్ అన్నారు. శుక్రవారం ఆయన కట్టమంచిలోని ఒక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులనుద్దేశించి మాట్లాడుతూ హిందువుల్లో నిగ్రహం, ఓపిక, శ్రద్ధ, సాటివారి పట్ల ప్రేమ చాలా గొప్పవన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచమంతా అనుకరించడం హిందువులు చేసుకున్న పుణ్యమన్నారు. హైందవ పురాణ ఇతిహాసాలను ఆధారం చేసుకుని పాశ్చాత్య దేశాలు అభివృద్ధి సాధిస్తున్నా యన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ సంఘాల నాయకులతో పాటు నారాయణ అమ్మ ఆలయ పీఆర్వో కళ్యాణ చక్రవర్తి, తిరుకుమరన్, చిట్టిబాబు పాల్గొన్నారు.

సైన్యంలో చేరి దేశానికి సేవలందించాలి

చిత్తూరు (సెంట్రల్), జూలై 26: యువత సైన్యంలో చేరి, దేశానికి సేవ చేయాలని పీవీకేఎన్ ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పిలుపు నిచ్చారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం కళాశాలలో కార్గిల్ యుద్ధంలో మరణించిన వీరజవాన్ల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రతి విద్యార్థీ దేశ సేవలకు అంకితం కావాలని సూచించారు. సేవా భారతి జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగిన తీరును, భారతీయ సైనికుల ధైర్యసాహసాలను వివరించారు. కార్యక్రమంలో శివభారతి సంస్థ కార్యదర్శి హరీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర వీరులను స్మరించుకుంటూ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు, విద్యార్థులు శుక్రవారం గాంధీ విగ్రహం నుంచి నగరంలోని అమరజవాన్ స్థూపం వరకు ర్యాలీ చేపట్టారు. అమర వీరులకు నివాళి అర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. జిల్లా సైనిక్ సంక్షేమశాఖాధికారి విజయశంకర్, యూనియన్ నాయకులు రామచంద్ర, సురేంద్ర, పళని, భారతి, రఘుపతి, రాజన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ : అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్గిల్ విజయానికి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కార్గిల్ విజయ్ దివస్ పేరుతో అమర వీరుల త్యాగాన్ని స్మరించుకుంటున్నామని తెలిపారు. భారత సాయుధ బలగాల ధైర్యసాహసాలకు, త్యాగాలకు యావత్ భారత్ నివాళులర్పిస్తోందని ఎంపీ తెలిపారు.

విజయపురం : విజయపురంలో బీజేపీ నాయకులు జాతీయ జెండా ఎగురవేసి, కార్గిల్ దివస్ నిర్వహించారు. సైనికుల త్యాగాలను వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, నాయకులు రాము, యుగందర్‌రాజు, మునిరెడ్డి పాల్గొన్నారు.

నగరి : నగరిలో బీజేపీ నాయకులు టవర్ క్లాక్ నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు నారాయణస్వామినాయుడు, రామ్మూర్తి యాదవ్, రమేష్‌నాయుడు, జగదీష్‌రాజు, రాము, ప్రభాకర్ పాల్గొని మాజీ సైనికులను సన్మానించారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్న సైనికులకు నివాళి అర్పించారు.

గుడిపాల : బీజేపీ జిల్లా నాయకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం కుప్పిగానిపల్లిలో కార్గిల్ దివస్ నిర్వహించారు. విశ్రాంత సైనిక అధికారులు శేషాద్రి కుమార్, సుబ్రహ్మణ్యంలను సత్కరించారు. బీజేపీ నాయకులు మాధవ, చంద్రబాబు, రవి, స్వామినాథ్ గౌడ్, దేవరాజ్, బ్రహ్మానంద రెడ్డి, సాయి, ప్రతాప్, శేఖర్, సింధు, కుమార్, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కార్వేటినగరం : డీఎంపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అమరవీరులకు నివాళి అర్పించారు. హెచ్ఎం కేశవులు పాల్గొన్నారు.


చిత్తూరులో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ర్యాలీ


నగరిలో మాజీ సైనికులకు సన్మానం